వైభవంగా ఏకాదశి పూజలు



ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు



ఆలయం వద్ద నృత్యం చేస్తున్న బాలికలు





ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి, తులసి మాలల అలంకరణలో వేంకటేశ్వర స్వామి

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీ సెక్టార్ – 6లోని శ్రీ వేంకటేశ్వర స్వామి, ప్రసన్న అంజనేయస్వామి ఆలయంలో కార్తీక ఏకాదశి పూజలు వైభవంగా నిర్వహించారు. శ్రీవేంకటేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం కార్తీక శుద్ధ ఏకాదశిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేసినట్లు ఆలయ కమిటీ కార్యదర్శి ప్రసాదరావు వెల్లడించారు. భక్తులు సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం, దీపారాధన నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

మద్దిలపాలెం : కార్తీక ఏకాదశిని పురస్కరించుకుని విష్ణు ఆలయాలన్నీ మంగళవారం భక్తులతో కిటకిటలాడాయి. ఎంఎంటీసీ త్రిమూర్తిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. అర్చకులు వెంకటరమణాచార్యులు, గోపాలకృష్ణ శర్మ భక్తుల పేరిట ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులు ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించారు.

➡ కొత్త వెంకోజీపాలెంలోని రామాలయంలో వేంచేసి ఉన్న శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏకాదశిని పురస్కరించుకుని తులసి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని తులసి మాలలతో నిండుగా అలంకరించారు. కిషోర్ శర్మ భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు, అర్చనలు జరిపారు. అనంతరం కార్తీక ఏకాదశి విశిష్టతను భక్తులకు వివరించారు.

ఏయూ క్యాంపస్ : కార్తీక శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు బీచ్‌రోడ్డులోని పాండురంగస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచి మహిళలు ఆలయంలో ధ్వజస్తంభం వద్ద ఉసిరికాయలో దీపాలు వెలిగించారు. ఆలయంలో సుదర్శన, గాయత్రి హోమాలు జరిపారు. ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పాండురంగ స్వామికి పంచామృత అభిషేకం, అర్చన, అష్టోత్తర పూజలు చేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా చిన్నారుల నృత్య ప్రదర్శన అలరించింది.

ధరల పెరుగుదలతో సామాన్యులపై భారం

రేపు సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం శ్రేణుల ధర్నా



పాదయాత్రలో మాట్లాడుతున్న సీఐటీయూ నేత మణి

మద్దిలపాలెం : నిత్యం పెరిగిపోతున్న నిత్యావసర సరకుల ధరలు నియంత్రించాలని, పెంచిన కరెంట్ చార్జీలు రద్దు చేయాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని, యువతకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 14న సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు తెలిపారు. సీతమ్మధార పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఇంటింటికీ నిర్వహించిన పాదయాత్రలో ఆయన మాట్లాడారు. నిత్యావసర సరకుల ధరలు భారీగా పెరిగి ప్రజల నెత్తిన గుదిబండలా మారాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలు పెంచబోమన్న చంద్రబాబు అందుకు విరుద్ధంగా 4 నెలల్లోనే రూ.8 వేల కోట్లు భారం వేయడం, వచ్చే ఏడాదికి మరో రూ.11 వేల కోట్ల భారం మోపడానికి సిద్ధమవడం దారుణమన్నారు. సీఐటీయూ నేత పి.మణి మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుతామని చెప్పిన వారు ప్రస్తుతం కార్మికులనే తొలగించడానికి సన్నాహాలు చేయడం దుర్మార్గమని దుయ్యబట్టారు. ప్రజలపై భారం మోపితే ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతామన్నారు. మోదీ, టీడీపీ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 14న నిర్వహించే ధర్నా విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సంబంధిత కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చలపతి, వెంకటరావు, అప్పారావు, కుమారి, కృష్ణారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సిబ్బంది అందుబాటులో లేకుంటే చర్యలు

బీచ్‌రోడ్డు : సచివాలయ పని వేళల్లో కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి ఆదేశించారు. వార్డులోని 151, 155వ నంబరు సచివాలయాల్లో సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఆమె పరిశీలించారు. ఆమె వెళ్లేసరికి సిబ్బంది సచివాలయంలో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ప్రవర్తిస్తే సహించేది లేదన్నారు. ఇదే విషయమై రానున్న కౌన్సిల్‌లో చర్చిస్తానని ఆమె పేర్కొన్నారు.

సుబ్రహ్మణ్య స్వామికి పూజలు



సుబ్రహ్మణ్య స్వామికి అభిషేకం చేస్తున్న భక్తులు

మద్దిలపాలెం : కార్తీక ఏకాదశి, మంగళవారం కావడంతో కొత్త వెంకోజీపాలెంలోని శ్రీ గౌరీ జ్ఞాన లింగేశ్వర దేవాలయంలో సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు అరవెల్లి సూర్యప్రకాష్ శర్మ, సుబ్రహ్మణ్య శాస్త్రి, బాల భాస్కర శర్మ భక్తులతో స్వయంగా అభిషేకాలు చేయించారు. తెల్లవారుజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుపరచాలి



పారిశుధ్య సిబ్బందితో మాట్లాడుతున్న ఏఎంహెచ్‌వో డాక్టర్ కిశోర్

ఆరిలోవ : జీవీఎంసీ జోన్–2 ఏఎంహెచ్‌వో డాక్టర్ కిశోర్ మంగళవారం ఉదయం 12, 13వ వార్డుల్లో పర్యటించారు. ఆయా వార్డుల్లో పలు చోట్ల చెత్త నిల్వలు, కాలువల్లో మురుగు పేరుకుపోవడం, ఇళ్ల వద్ద తడి, పొడి చెత్తను సక్రమంగా సేకరించకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. దీనిపై శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బందితో మాట్లాడి పారిశుధ్యం మెరుగు పరచాలని ఆదేశించారు. విధుల్లో ఎవరూ నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. రోజూ సమయానికి అందరూ విధులకు హాజరుకావాలని తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నిర్వహించే హాజరు రికార్డు, పనిలో పాల్గొన్న వారిని పరిశీలించారు. వార్డుల్లో కొందరు సిబ్బంది హాజరు వేసుకుని పని చేయకుండా వెళ్లి పోతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, అలా జరగకుండా శానిటరీ ఇన్‌స్పెక్టర్ చూసుకోవాలని సూచించారు.

పర్యాటకులతో మంచిగా ప్రవర్తించాలి



మాట్లాడుతున్న సీఐ రమణయ్య

బీచ్‌రోడ్డు : నగరంలోని పర్యాటక ప్రాంతాలకు వచ్చే వారితో మంచిగా ప్రవర్తించాలని బీచ్ ఫొటోగ్రాఫర్లకు మూడో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పల్లా రమణయ్య సూచించారు. బీచ్‌రోడ్డులోని వైఎంసీఏలో ఫొటోగ్రాఫర్లకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీచ్‌కు వచ్చే సందర్శకులను ఫొటోలు తీసుకోమని బలవంతం చేయడం, అనుమతి లేకుండా ఫొటోలు తీసి డబ్బులు ఇవ్వాలని బెదిరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పర్యాటకులతో మంచిగా ప్రవర్తించి వారికి ఇష్టమైతేనే ఫొటోలు తీయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సురేష్ పాల్గొన్నారు.

పోషకాహారంతో మధుమేహం నియంత్రణ

ఏయూ క్యాంపస్ : పోషకాహారం తీసుకుంటే మధుమేహాన్ని నియంత్రించడం సాధ్యమేనని వెల్‌నెస్ కన్సల్టెంట్, న్యూట్రిషనిస్ట్ షీలా కృష్ణమూర్తి అన్నారు. నవంబర్ 14న ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఒక హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) అధ్యయనంలో 101 మిలియన్ల భారతీయులకు మధుమేహం ఉన్నట్లు తేలిందన్నారు. మనం తినే ఆహారంలో పోషకాలు ఉండేటట్లు చూడాలని, బాదం వంటివి తీసుకోవాలని సూచించారు. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి ఉపయోగపడతాయన్నారు. భోజనానికి ముందు బాదం తినడం వల్ల బ్లడ్ షుగర్ నియంత్రణ మెరుగుపడిందని పరిశోధనలో గుర్తించారన్నారు.

అత్యవసర విధులకు స్వాట్ టీం

- 30 మందితో కూడిన ప్రత్యేక బృందానికి శిక్షణ
- అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా



స్వాట్ టీం ఉపయోగించే గ్యాస్ గన్ పరిశీలిస్తున్న అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా

ఆరిలోవ: అత్యవసర పరిస్థితులు, ఆందోళనల్లో సేవల కోసం స్వాట్ టీం పేరిట ప్రత్యేక పోలీసుల బృందాన్ని సిద్ధం చేసినట్లు అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. స్థానిక విశాలాక్షినగర్‌లోని కైలాసగిరి ఏఆర్ కార్యాలయంలో 30 మందితో కూడిన స్వాట్ టీంకు కొద్ది రోజులుగా ఇస్తున్న శిక్షణ, మంగళవారంతో ముగిసింది. కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని శిక్షణ పొందినవారిని అభినందించారు. ఎక్కడైనా అత్యవసర పరిస్థితులు నెలకొన్నప్పుడు ఈ బృందాన్ని వినియోగిస్తామన్నారు. ఆయుధాల్లేకుండా మూకల్ని చెదరగొట్టి పరిస్థితులను చక్కదిద్దడంలో వీరిని నిష్ణాతులుగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. గ్యాస్ గన్‌లు, వాటర్ గన్‌లను ఉపయోగించడం, మూకల్ని చెదరగొట్టి పోలీస్ జీపుల్లో ఎక్కించి సంఘటనా స్థలం నుంచి దూరంగా తీసుకెళ్లడం తదితర పనులు చాకచక్యంతో చేస్తారని తెలిపారు. బృందంలో కొందరు మహిళలు కూడా ఉన్నట్లు తెలిపారు. ఈ బృందం వినియోగించే ప్రత్యేక యూనిఫాం, హెల్మెట్, లాఠీలు, స్టోన్ గార్డ్, లాంగ్ రేంజ్, షార్ట్ రేంజ్ షెల్స్, స్మోక్ షెల్స్, గ్యాస్ గన్, రైట్ గేర్ ఎక్విప్‌మెంట్ తదితర వాటిని పరిశీలించారు. వాటిని మూకలు, ఆందోళనకారులపై ఏ విధంగా ఉపయోగించాలో మెలకువలు నేర్పారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఆర్‌ఐలు మన్మధరావు, రామకృష్ణారావు, ఏఆర్ ఎస్‌ఐలు ఆదినారాయణ, ఢిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నీటి నిల్వలతో దోమల ఉత్పత్తి



లక్ష్మీనగర్‌లో సంప్‌లో ఆయిల్ బాల్స్ వేస్తున్న సిబ్బంది

మద్దిలపాలెం : నిల్వ నీరు దోమల ఉత్పత్తికి అవాసంగా నిలుస్తోందని, ఇళ్లలో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా నివారణ విభాగం కార్యకర్త కె.వేణుగోపాల్ సూచించారు. డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని మంగళవారం శివాజీపాలెం పరిధి లక్ష్మీనగర్ కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగా నిర్మిస్తున్న భవనాల్లోని సంప్‌లలో ఆయిల్ బాల్స్ వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం, మంగళవారం నిర్వహించే డ్రైడే ఫ్రైడే కార్యక్రమానికి అందరూ సహకరించాలని కోరారు. ఇళ్లలో నీటి నిల్వలను గుర్తించడం ఎంతో కీలకమైనదన్నారు. వారం పైబడి నీరు నిల్వ ఉంటే లార్వా ఉత్పత్తి అవుతుందన్నారు. తద్వారా దోమలు వృద్ధి చెందుతాయన్నారు. ఆ దోమ కాటు వల్లే డెంగ్యూ జ్వరాలు సోకుతున్నాయన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి పరిసరాలు తనిఖీ చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ మలేరియా నివారణ విభాగం సిబ్బంది, యాంటీ లార్వా బృందం పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ విద్యా సంస్థలను పరిరక్షించాలి



జాతీయ సదస్సు పుస్తకం ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్, ఆచార్యులు

విశాఖ విద్య : ప్రభుత్వ రంగ విద్యాసంస్థలను పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు సూచించారు. విద్యా విభాగం ఆధ్వర్యంలో యూజీసీ సహకారంతో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు ఈక్విటీ డైవర్సిటీ అండ్ ఇంక్లూషన్ ఎన్‌ఈపీ – 2020 ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన విద్యా విధానం సమగ్రంగా, అనువుగా నిలుస్తోందన్నారు. విదేశీ విద్యా విధానానికి దగ్గరగా ఉందన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య నరసింహారావు మాట్లాడుతూ నూతన విద్యా విధానం పటిష్టంగా అమలు చేయడానికి ఇటువంటి సదస్సులు దోహదపడతాయన్నారు. ఒడిశాలోని రేవనేశ్వ యూనివర్సిటీ డీన్ స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆచార్య సుదర్శన్ మిశ్రా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 1,168 విశ్వవిద్యాలయాలు, 45 వేలకు పైగా కళాశాలలున్నాయని, వీటి సంఖ్య ఇంకా పెరగాల్సిన అవసరం ఉందన్నారు. సదస్సు నివేదికను ఆచార్య టి.షారోన్ రాజు నివేదించారు. కార్యక్రమంలో ఐఏఎస్ఈ ప్రిన్సిపల్ ఆచార్య నాగరాజ కుమారి, ఇగ్నో ప్రాంతీయ కేంద్రం సీనియర్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ జి.ధర్మారావు, విశ్రాంత ఆచార్యులు అట్లూరి శ్యామ్ ప్రసంగించారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



నూతన విద్యార్థులతో విజయ రవీంద్ర తదితరులు

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీ సమత కళాశాలలో ఉత్సాహంగా ఎంఎస్సీ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు, కేరింతల నడుమ ఆహ్లాదకరంగా గడిపారు. మంగళవారం నిర్వహించిన వేడుకలను కళాశాల కరస్పాండెంట్ ఆచార్య విజయరవీంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూనియర్, సీనియర్ విద్యార్థుల మధ్య పరిచయానికి ఫ్రెషర్స్ డే వేదికగా నిలుస్తుందన్నారు. స్నేహపూర్వక వాతావరణంలో కళాశాల విద్యను పూర్తి చేయడంతో పాటు మంచి ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకునే లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు.

ఆనందమార్గ్‌కు సత్యసాయి విద్యార్థుల సాయం



ఆనందమార్గ్ ఆశ్రమంలో సరకులు అందజేస్తున్న సత్యసాయి పాఠశాల విద్యార్థులు

ఆరిలోవ : జీవీఎంసీ పదో వార్డు పరిధి ఇందిరానగర్‌లోని ఆనందమార్గ్ ఆశ్రమాన్ని ఎంవీపీ కాలనీలోని సత్యసాయి విద్యా విహార్ విద్యార్థులు మంగళవారం సందర్శించారు. ఆశ్రమంలో విద్యార్థులకు నిత్యావసర సరకులు అందజేశారు. దుప్పట్లు, తువ్వాళ్లు, బియ్యం, కాస్మొటిక్స్, టూత్‌బ్రెష్‌లు, టూత్ పేస్టులు, తదితర సరకులు పిల్లల కోసం ఆశ్రమం స్వామీజీ సౌమ్యానంద్ అవధూతకు అందజేశారు. ఈ వస్తువులను పాఠశాల విద్యార్థులు దీపావళి బాణసంచా కొనుగోలు చేసుకోకుండా సమకూర్చి అందజేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా ఆశ్రమం స్వామీజీ పిల్లలను అభినందించి, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీలోని శ్రీ సత్యసాయి విద్యావిహార్ విద్యార్థుల ఆధ్వర్యంలో పీఎం పాలెంలోని శ్రీ మాతృశ్రీ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో, అక్కయ్యపాలెంలోని ప్రియదర్శిని ఓల్డేజ్ హోమ్‌లో మంగళవారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఓల్డేజ్ హోమ్‌కు బియ్యం, పప్పు దినుసులు, నూనె, ఇతర సామగ్రి అందజేశారు. దీంతోపాటు ఓల్డేజ్ హోమ్‌లోని వృద్ధులకు చీరలు, దుప్పట్లు, టవల్స్‌తో కూడిన కిట్లు, పలు రకాల పండ్లు అందజేశారు.

రేపు కృష్ణా కళాశాలలో జాబ్ మేళా

మద్దిలపాలెం: నైపుణ్య అభివృద్ధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 14న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో శ్రీ తమ్మినా సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్, కల్యాణ్ జ్యువెలర్స్ ఇండియా లిమిటెడ్, ఎస్.కె.ఎల్ అసోసియేట్స్ కంపెనీలు పాల్గొంటున్నాయి. 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ, ఎంబీఏ పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఎంపికైన వారు విశాఖపట్నం, గాజువాక, హైదరాబాద్‌లో ఉద్యోగం చేయాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు 98856 94676కు సంప్రదించవచ్చు.

పారిశుధ్య సిబ్బందికి దుస్తుల పంపిణీ



దుస్తులు అందిస్తున్న కార్పొరేటర్ మువ్వల లక్ష్మి



పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేస్తున్న కార్పొరేటర్ సునీత

బీచ్‌రోడ్డు : ఇటీవల సంభవించిన వరదల్లో తీవ్రంగా నష్టపోయిన విజయవాడ పరిసర ప్రాంతాల్లో సేవలందించిన పారిశుధ్య కార్మికులకు రెండు జతల దుస్తులను జీవీఎంసీ 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి మంగళవారం అందజేశారు. జీవీఎంసీ కమిషనర్ ఆదేశాలతో మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆమె తెలిపారు.

ఆరిలోవ : గత నెలలో వరద కారణంగా ముంపునకు గురైన విజయవాడలో సేవలు అందించిన విశాఖ పారిశుధ్య కార్మికులకు మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. 13వ వార్డు నుంచి విజయవాడ వెళ్లి సేవలందించి తిరిగొచ్చిన 15 మందికి స్థానిక కార్పొరేటర్ కెల్ల సునీత దుస్తులు అందజేశారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

14న డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

మద్దిలపాలెం : మద్దిలపాలెం ఆర్టీసీ డిపోలో ఈ నెల 14న డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నామని డిపో మేనేజర్ అరుణకుమారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం సలహాలు, సూచనలు కోరుతూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఇందుకోసం 99592 25597ను సంప్రదించాలని ఆమె కోరారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ఎంవీపీ కాలనీ : ఈ నెల 14 నుంచి ఎంవీపీ కాలనీ శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆ గ్రంథాలయాధికారి ఉమామహేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. 14న ప్రారంభ వేడుకతోపాటు జాతీయ పతాకావిష్కరణ, 15న పుస్తక ప్రదర్శన, 16న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, 17న గ్రంథాలయ ఉద్యమకారులను స్మరించుకోవడం, 18న చిత్రలేఖన పోటీలు, 19న ముగ్గుల పోటీలు, 20న ముగింపు సభ నిర్వహిస్తామని తెలిపారు.

అమెరికన్ కార్నర్ సేవలు విస్తృతం చేస్తాం

విశాఖ విద్య : విశ్వవిద్యాలయానికి, విద్యార్థులకు మరింత విలువ జోడించే విధంగా అమెరికన్ కార్నర్ పనిచేస్తుందని అమెరికన్ స్పేసెస్ సౌత్ ఏషియా హెడ్ క్యాథలిన్ ఫాక్స్ అన్నారు. మంగళవారం ఉదయం వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుతో వీసీ కార్యాలయంలో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక విద్యార్థులకు ఉపయుక్తంగా విభిన్న కార్యక్రమాలకు రూపకల్పన చేయాలని సూచించారు. అమెరికన్ కార్నర్ నుంచి విద్యార్థి క్లబ్, కల్చరల్ షో, వర్క్ షాప్ నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్థులను భాగస్వాములను చేస్తూ కార్యక్రమాలు రూపొందించాలని యూఎస్ కాన్సులేట్ జనరల్ హైదరాబాద్ కేంద్రం పబ్లిక్ డిప్లమసీ ఆఫీసర్ ఎమీలియా స్మిత్ సూచించారు. ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు మాట్లాడుతూ అమెరికన్ కార్నర్ నుంచి నిర్వహించే కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని తెలిపారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనంజయరావు మాట్లాడుతూ ఏయూలో 64 దేశాలకు చెందిన 1200 మంది విదేశీ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో అమెరికన్ స్పేసెస్ ప్రోగ్రాం ప్రతినిధి సంజయ్ భగత్, యూఎస్ కౌన్సిలేట్ జనరల్ (హైదరాబాద్) పబ్లిక్ ఎంగేజ్మెంట్ అడ్వైజర్ సాలిల్ కాద, ఏయూ అమెరికన్ కార్నర్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ పాల్ డగ్లస్ పాల్గొన్నారు.

ఎగ్జాస్ట్ సైలెన్సర్లు విక్రయిస్తే కఠిన చర్యలు

బీచ్‌రోడ్డు : ఎగ్జాస్ట్ సైలెన్సర్లు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆటో మొబైల్ షాపు యాజమానులను మూడో పట్టణ పోలీసు స్టేషన్ ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడు హెచ్చరించారు. ట్రాఫిక్ జోన్ – 1 పరిధిలోని ఆటో మొబైల్ షాపుల యాజమానులు, ద్విచక్ర వాహనాల మెకానిక్‌లకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాదారులు మోడిఫికేషన్ సైలెన్సర్లు తీసుకొచ్చి వాహనానికి అమర్చమంటే పోలీసులకు సమాచారమివ్వాలని సూచించారు. సైలెన్సర్ల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే మోటార్ వాహన చట్టం – 1988 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జోన్ – 1 ట్రాఫిక్ సీఐలు ఎం.శ్రీనివాసరావు, ప్రసాద్‌రావు, ఎన్.సాయి పాల్గొన్నారు.